ప్రజాశక్తి

రాష్ట్ర మహాసభల పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ విమర్శించారు. స్థానిక గనేనాయక్ భవనంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ముఖ్య నాయకులు సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్య రంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందుకు తగిన ప్రణాళిక ఏర్పాటు చేయడం కోసం అనంతపురం వేదిక కాబోతుందన్నారు. అక్టోబర్ 5 నుంచి 8 వ తేదీవరకు అనంతపురంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నిర్మాణ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 450 మంది ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు హాజరుకానున్నారని చెప్పారు. ఈ సభలకు రాష్ట్రంలోని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, విద్యావేత్తలు హాజరవుతున్నారన్నారు. ఈ మహాసభల్లో ఎస్‌ఎఫ్‌ఐ చేసే పోరాటాలకు ప్రణాళిక ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో వచ్చి100 రోజులు పూర్తి చేసుకుందని అయితే విద్యా రంగంలో రోజురోజుకీ విద్యార్థులు సమస్యలు పుట్టుగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని అన్నారు. మెడికల్ కళాశాలలను నిర్వహించలేమని 700 ఎంబిబిఎస్ సీట్ల రద్దు కోసం ఎన్ఎంసికి ప్రభుత్వం లేఖ రాయడం దుర్మార్గమన్నారు. అంతేకాక మరో ఏడు కళాశాలల నిర్మాణం ఆపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాడన్ని ఎస్‌ఎఫ్‌ఐ త్రీవంగా ఖండిస్తోందన్నారు. సంక్షేమ హాస్టళ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నిర్మాణ మహాసభల పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత, జిల్లా అధ్యక్షులు సిద్దు, ఉపాధ్యక్షులు రమేష్, శివ, జిల్లా సహాయ కార్యదర్శులు సూర్యప్రకాష్, భీమేష్, వంశీ, అనంతపురం నగరం నాయకులు సోము,గణేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు

వైసిపి హయాంలో ఇరిగేషన్ వ్యవస్థ నిర్వీర్యం

జీడిపల్లి జలాశయం వద్ద మంత్రి నిమ్మల, తదితరులు

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - అనంతపురం

వైసిపి హయాంలో ఇరిగేషన్ వ్యవస్థ నిర్వీర్యం అయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. బెలుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్ వద్దనున్న పంప్ హౌస్‌ను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయలసీమలో ఇరిగేషన్ వ్యవస్థ అంతా నిర్వీర్యమై 20 సంవత్సరాల వెనక్కి వెళ్లిన పరిస్థితి ఉందన్నారు. దానికి ఉదాహరణగా హంద్రీనీవానే అని అన్నారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 3,850 క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో హంద్రీనీవా ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టి, దీనికి మచ్చుమర్రిని సమాంతరంగా నిర్మాణం చేసి రాయలసీమలో నాలుగు ఉమ్మడి జిల్లాలకు సంబంధించి హంద్రీనీవా ద్వారా తాగు, సాగునీరు అందించాలనే ఆలోచనతో పని చేశారన్నారు. అయితే ఇప్పుడు కాలువలో 1,800 నుంచి 1,900 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తున్న పరిస్థితి ఉందనానరు. గత ఐదేళ్లలో 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో నీరు వెళ్లాలని చేపట్టిన పనులను పూర్తి చేసి ఉంటే ఈరోజు పూర్తిస్థాయి సామర్థ్యంతో హంద్రీనీవా కాలువనుఉపయోగించుకునే పరిస్థితి ఉండేదన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో హంద్రీనీవాకు దాదాపు 4 వేల కోట్ల రూపాయలు 5 సంవత్సరాల్లో ఖర్చు పెడితే, 500 కోట్ల రూపాయలు కూడా గత ప్రభుత్వం హయంలో ఖర్చుచేయలేదని విమర్శించారు. 60 టీఎంసీల నీటిని తీసుకోవాల్సిన హంద్రీనీవా కాలువ ఇప్పుడు 20, 25 టీఎంసీల నీటిని కూడా వాడుకోలేని పరిస్థితి ఉందన్నారు. దీన్నిదృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఆదేశాల ప్రకారం పూర్తి సామర్థ్యంతో హంద్రీనీవా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 3,850 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా మెయిన్ కెనాల్ విస్తరణ చేపట్టి పూర్తి సామర్థ్యంతో హంద్రీనీవాని ఉపయోగించుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల ప్రకారమే ఇరిగేషన్ ఉన్నతాధికారులు, తాము హంద్రీనీవా, మాల్యాల నుంచి దాదాపు 700 కిలోమీటర్లు కాలువ పరిశీలన చేసి ప్రాక్టికల్‌గా ఒక రిపోర్ట్ సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి జీడిపల్లి రిజర్వాయర్ వద్దనున్న పంప్ హౌస్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ప్రాజెక్ట్స్ సీఈ నాగరాజ, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశే నాయక్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఆర్డీవో రాణిసుస్మిత, హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ రాజా స్వరూప్ కుమార్, డిఈలు శ్రీనివాసులు నాయక్, రామచంద్ర మూర్తి, రాఘవేంద్రరావు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర హెచ్ఎల్‌సి ఆధునీకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

మంత్రి నిమ్మలకు సిపిఎం నాయకుల వినతి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం రాష్ట్ర నాయకులు ఓబులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రాయలసీమ జిల్లాలకు ప్రాణధారగా నిలిచిన తుంగభద్ర హెచ్ ఎల్ సి ఆధునీకరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సిపిఎం రాష్ట్ర నాయకులు జి ఓబులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమను జిల్లా ప్రజా ప్రతినిధులను సిపిఎం జిల్లా ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు జి ఓబులు మాట్లాడుతూ అనంతపురము జిల్లా జలవనరుల అభివృద్ధి పనులు, తాగు నీరు సాగునీరు కొరకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, తరిమెల నాగరాజు, టి రామాంజనేయులు, ఇల్లూరు నల్లప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను ప్రశాంతంగా ఉంచేందుకు కృషి

ఎస్పీ పి. జగదీష్

అనంతపురం క్రైం : జిల్లాను ప్రశాంతంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ పి.జగదీష్ సిబ్బందికి ఆదేశాలు చేశారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పాత నేరస్తులు, రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అక్రమ మద్యం అమ్మే నివాసాలను అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు చేశారు. గ్రామాల్లో సభలు నిర్వహించి అవగాహన కల్పించారు. గొడవలు, అల్లర్లు జోలికి వెళ్లొద్దని , జీవితాలు నాశనం చేసుకోవద్దని పోలీసులు సూచించారు. ఎలాంటి అల్లర్లు, గొడవలు జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని ప్రజానీకానికి పోలీసులు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సమస్యాత్మకమైన వ్యక్తుల పట్ల పోలీసుల నిఘా కొనసాగుతుందని హెచ్చరించారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులను చట్టం వదిలి పెట్టదన్నారు. అక్రమ ఆయుధాల వ్యాపారాలు కట్టి పెట్టాలని హెచ్చరికలు చేశారు. అక్రమ వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గంజాయి, బెల్ట్ షాపులపై దాడులు చేశారు. ఇందులో భాగంగా రాయదుర్గం పరిసర ప్రాంతాల్లో టెట్రా పాకెట్స్ అమ్ముతున్న వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుత్తిలో భారీ వర్షం

పలుప్రాంతాల్లో ఇళ్లల్లోకి చేరిన వర్షం నీరు-బేతాపల్లిలో దెబ్బతిన్న వేరుశనగ

ప్రజాశక్తి-గుత్తి

మండల వ్యాప్తంగా శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. బాచుపల్లి, ధర్మాపురం గ్రామాల్లో అత్యధికంగా వర్షం పడింది. మండలంలో 96.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గుత్తి ఆర్ఎస్‌లోని పలు కాలనీల్లోని నివాసాల్లోకి వర్షం నీరు చేరింది. దీంతో ఆయా కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. అలాగే పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు నీట మునిగాయి. బేతాపల్లి గ్రామంలో కురిసిన వర్షానికి రైతు తలారి నెల్లూరప్ప చెందిన 3.5 ఎకరాల భూమిలో సాగుచేసిన వేరుశెనగ పంట దెబ్బతింది. దీంతో దాదాపు రూ.లక్ష ఆర్థికంగా నష్టపోయానని రైతు వాపోయాడు.

తడిసిన వేరుశనగ పంటను చూపుతున్న రైతు

వికలాంగుల అభ్యున్నతికి చేయూత

వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి ఎస్.అబ్దుల్ రసూల్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడిన వారికి ప్రభుత్వం నుంచి అన్ని విధాలా చేయూతను అందిస్తున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి ఎస్. అబ్దుల్ రసూల్ పేర్కొన్నారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వారిని గుర్తించి వారికి ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందించేలా తమ శాఖ కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాన కల్పించి అర్హులకు లబ్ది చేకూరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తితో నిర్వహించిన ముఖాముఖిలో ఆశాఖ ద్వారా జరుగుతున్న పలు విషయాలను వివరించారు.

ప్రశ్న :ఉమ్మడి జిల్లాలో ప్రోత్సాహాల గురించి వివరించండి.?

ఏ డీ : ప్రస్తుతం అనంతపురం, సత్యసాయి జిల్లాలో ఉన్న వికలాంగుల అభివృద్ధి కోసం అనంతపురంలో జిల్లా కార్యాలయం ఏర్పాటు చేశాం. అక్కడి నుండే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో కార్యాలయాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నాం. ఇటీవల ఉమ్మడి జిల్లాలో వికలాంగుల కోసం మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశాం డిగ్రీ, పీజీ విద్యార్థులకు ట్యాబులు, ట్రైసైకిళ్లను పంపిణీ చేశాం.

ప్ర : వికలాంగ విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు ఏమిటి.?

జ : డిగ్రీ, డిప్లొమా అంతకంటే ఎక్కువ తరగతులు చదువుతున్న విద్యార్థులకు, 40 శాతం అంతకంటే ఎక్కువ అంగవైకల్యం కలిగి ఉండి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించని వారికి ప్రోత్సహాలను అందజేస్తున్నాం. వీటిని పొందేందుకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

ప్ర : వికలాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారా.?

జ : ఏపీ ప్రభుత్వం 2002 నుంచి వికలాంగుల కోసం ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ఏర్పాటు చేసింది. 2020 సంవత్సరంలో నాలుగు శాతం రిజర్వేషన్లు పెంచింది. దృష్టిలోపం, వినికిడి లోపం, వైకల్యం, మేధావైకల్యం, నిర్దిష్ట అభ్యాసన వైకల్యం, మానసిక ఆనారోగ్యం, బహుళ వైకల్యం ఉన్నవారికి ఈ సంవత్సరం నుంచి బ్యాక్ లాగ్ పోస్టులు ఇవ్వనున్నాం. ఇదివరకు 37 పోస్టులను మంజూరు చేశాం. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు నోటిఫికేషన్ జారీ చేస్తాం.

ప్ర : అంధుల కోసం చేస్తున్న కార్యక్రమాలు ఏమిటి.?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంధుల కోసం రెండు హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో 150 మంది ఆంధులకు పునరావవాసం కల్పించాం. వారిలో వందమంది బాలురు, 50 మంది బాలికలు ఉన్నారు. అంధుల కోసం హాస్టళ్లలో ఉచితంగా వసతి, ఆహారం కాస్మోటిక్ ఛార్జీలు ఇస్తున్నాం. వయోవృద్ధులకూ కొన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ఏడీ అబ్దుల్ రసూల్

ప్ర : వికలాంగులకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇస్తున్నారు..?

జ : వికలాంగులు, వయోవృద్ధులు, విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో పథకాల ద్వారా చేయూతను ఇస్తోంది. విద్యార్థులు తల్లిదండ్రుల ఆదాయాన్ని బట్టి జాతీయ ఉపకార వేతనాలు, ట్రై సైకిల్ చక్రాల కుర్చీలు, త్రీ వీలర్లు, వినికిడి పరికరాలు, వాకింగ్ స్టిక్, ప్లేటు వంటి వివిధ సహాయ ఉపకరణాలను అందిస్తోంది. డిప్లొమా, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న వారికి ట్యాబులు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నాం.

ముగిసిన దులీప్ ట్రోఫీ పోటీలు

విజేతగా ఇండియా- ఎ జట్టు

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం ఆర్డీటీ క్రీడాగ్రామంలో ఈనెల 5న ప్రారంభమైన దులీప్ ట్రోఫీ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈటోర్నీలో 12 పాయింట్లతో ఇండియా- ఏ జట్టు అగ్రస్థానంలో నిలిచి టోర్నీ విజేతగా నిలిచింది. 9 పాయింట్లతో ఇండియా- సీ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అనంతపురం ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో చివరి రౌండ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇండియా ఏ జట్టు 132 పరుగులతో ఇండియా సీ జట్టుపై, ఇండియా డీ జట్టు 257 పరుగుల భారీ తేడాతో ఇండియా- బీ జట్టుపై విజయం సాధించాయి. ఇండియా బీతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా - డీ బ్యాట్స్‌మెన్ రిక్కీభుయ్ (56, 119) ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఇండియా ఏతో జరిగిన మ్యాచ్‌లో సీ జట్టు క్రీడాకారుడు సాయిసుదర్శన్ సెంచరీ సాధించాడు. ఇండియా - సితో జరిగిన మ్యాచ్‌లో ఏ జట్టు క్రీడాకారుడు శాశ్వత్ రావత్ (124, 53) ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఇండియా సీ జట్టు క్రీడాకారులు అన్షుల్ కాంబోజ్ ప్లేయర్ ఆఫ్ ద సీసీస్‌గా(16 వికెట్లు, 41 పరుగులు) నిలిచాడు. టోర్నీ విజేత ఇండియా-ఏ జట్టుకు ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు విన్నర్స్ కప్‌ను అందజేశారు. రన్నర్స్‌కు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కప్‌ను అందజేశారు. స్ట్రైకర్ ఆఫ్ ది సిరీస్ కింద రికీభుయ్‌కి మంత్రి పయ్యావుల కేశవ్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌కు సంబంధించి ఏ గ్రౌండ్‌లో శాశ్వర్‌రావత్‌కు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, బి గ్రౌండ్‌లో రిక్కీభుయ్‌కి ఏసీఏ అతిథి ఆర్‌విఎస్‌కె. రంగారావ్ చెక్కులను అందజేశారు.

రిక్కీభుయ్ అజేయ శతకం..ఇండియా డీ భారీ విజయం

ఇండియా బీతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా డీ జట్టు భారీ విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోర్ 244/5తో ప్రారంభించిన ఇండియా డీ జట్టు 305 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తెలుగుతేజం రిక్కీభుయ్ అజేయ శతకం సాధించాడు. టోర్నీలో రిక్కీ భుయ్ రెండో సెంచరీ ఇది. చివరి మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లోనూ రిక్కీభుయ్ అర్ధ సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. 124 బంతులు ఎదుర్కొన్న రిక్కీ భుయ్ 15 ఫోర్లు, 3 సిక్సర్ల సహాయంతో 119 పరుగులతో అజేయంగా నిలిచాడు. దీంతో ఇండియా డీ జట్టు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కలుపుకుని ఇండియా బీ జట్టు ముందు 373 పరుగలు లక్ష్యాన్ని ఉంచింది.

అర్ష్‌దీప్, థాకరే ధాటికి బీ జట్టు 115కి ఆలౌట్

373 పరుగుల భారీ లక్ష్యంతో బరిలో దిగిన ఇండియా బీ జట్టు ఇండియా డీ జట్టు బౌలర్లు అర్ష్‌దీప్ సింగ్, ఆదిత్య థాకరే ధాటికి విలవిలలాడింది. వీరిద్దరూ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో బీ జట్టుపై విరుచుకుపడ్డారు. అర్ష్‌దీప్ సింగ్ 11.2 ఓవర్లలో 40 పరుగులిచ్చి 6 వికెట్లు, ఆదిత్య థాకరే 11 ఓవర్లలో 59 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టారు. దీంతో ఇండియా బీ జట్టు 22.2 ఓవర్లలో కేవలం 115 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇండియా డీ జట్టు 257 పరుగుల భారీ తేడాతో బీ జట్టుపై గెలుపొందింది.

సాయిసుదర్శన్ సెంచరీ వృథా.. ఇండియా సీ 217 పరుగులకు ఆలౌట్

ఇండియా ఏతో జరిగిన మ్యాచ్‌లో సీ జట్టు క్రీడాకారుడు సాయి సుదర్శన్ చేసిన సెంచరీ వథా అయ్యింది. ఓవర్‌నైట్ స్కోర్ 270/6తో ప్రారంభించిన ఇండియా ఏ జట్టు మరో 16 పరుగులు జోడించి డిక్లేర్ చేసింది. దీంతో ఇండియా సీ జట్టు ముందు 350 పరుగుల లక్ష్యం నిలిచింది. భారీ చేధనలో ఏ బౌలర్ల ధాటికి సీ జట్టు క్రీడాకారులు నిలువలేకపోయారు. 81.5 ఓవర్లలో 217 పరుగులకు ఆ జట్టు ఆలౌట్ అయింది. ఆ జట్టులో సాయిసుదర్శన్ ఒంటిరి పోరాటం చేశాడు. 206 బంతుల్లో 12 బౌండరీల సహాయంతో 111 పరుగులు చేశాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 44(5 ఫోర్లు), వైశాక్ 17, ఇషాన్ కిషన్17 మినహా మిగితా వారు రెండంకెల స్కోర్ కూడా దాటలేకపోయారు. ఇండియా ఏ జట్టు బౌలర్లలో ప్రసిద్ధ్‌కృష్ణ 3, తనుష్ కొటియన్ 3, అకీబ్‌ఖాన్2, సామ్స్ ములానీ వికెట్ తీసుకున్నారు. దీంతో ఇండియా ఏ జట్టు 132 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముగింపు కార్యక్రమంలో ఏసీఏ కౌన్సిలర్ డి.గౌర్ విష్ణు, గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

నలుగురు యువకులు మృతి

రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట సమీపాన శనివారం అర్ధరాత్రి జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి బుక్కరాయసముద్రం సిఐ కరుణాకర్ తెలిపిన వివరాలు... అనంతపురం జిల్లా కేంద్రంలోని స్టాలిన్ నగర్‌కు చెందిన దాసరి శ్రీనివాసులు (23), షేక్ మస్తాన్(19), ఎర్రగుడి పవన్ కుమార్, ఓబులశెట్టి పవన్ (23) పనినిమిత్తం ఇన్నోవా కారులో నార్పలకు శనివారం రాత్రి 12 గంటల సమయంలో బయలుదేరారు. అదే సమయంలో నార్పల నుండి అనంతపురం జిల్లా కేంద్రానికి వేరుశనగ విత్తనాలతో లోడుతో వస్తున్న లారీ రేగులకుంట సమీపాన ఇన్నోవాను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇన్నోవాలో ఉన్న నలుగురు యువకులు అక్కడికి అక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతులు దాసరి శ్రీనివాసులు, షేక్ మస్తాన్ (ఫైల్‌ఫోటోలు)

మృతులు ఎర్రగుడి పవన్‌కుమార్, ఓబులశెట్టి పవన్ (ఫైల్‌ఫోటోలు)

ప్రజాశక్తి
www.prajasakti.com

2023 ఖరీఫ్, రబీ బీమా ప్రకటించాలి

25న కలెక్టరేట్ ముందు ధర్నా-ఎపి రైతుసంఘం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

2023లో రైతులు సాగు చేసి నష్టపోయిన ఖరీఫ్, రబీ పంటల బీమాను వెంటనే ప్రకటించాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023లో ఖరీఫ్, రబీలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడి రైతులను పంటలను నష్టపోయారన్నారు. దీంతో చేసిన అప్పులు ఎలా కట్టాలో దిక్కు తోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారన్నారు. అంతేగాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023 ఖరీఫ్‌లో 28 మండలాలు, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా సహాయక చర్యలు మాత్రం చేపట్టలేదన్నారు. కావున రైతులను ఆదుకోవడానికి 2023 ఖరీఫ్, రబీ బీమాను ప్రకటించి వెంటనే రైతుల ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. కాగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే ఇవ్వాలన్నారు. అలాగే మోటార్లకు మీటర్ల బిగింపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్నాలో రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తర్వాత సీతారాం ఏచూరి జీవిత చరిత్రపై 'లాల్ సలాం' పేరుతో ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి దస్తగిరి, అధ్యక్షులు మద్దిలేటి, రైతులు సత్యనారాయణ, నరసమ్మ, రాముడు, నారాయణ, సుంకన్న, మస్తాన్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - కుందుర్పి

గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపిడిఒ లక్ష్మీనరసింహా సూచించారు. ఆదివారం మండల పరిధిలోని మలయనూర్ గ్రామంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చాయన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పరిసరాలను శుభ్రం చేసుకోవడంతోపాటు ఇళ్లలో పొగ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, సర్పంచి గోవిందమ్మ, ఓబన్న, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, మహబూబ్‌బాషా, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు గంగాధర, సంజీవస్వామి, రాజ్‌కుమార్, ఓబుళప్ప, బాబు, వీరాంజనేయులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సొమ్ముకు కాపలాదారులం

అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళీధర్

సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళీధర్

ప్రజాశక్తి-అనంతపురం

ఖాతాదారుల సొమ్ముకు కాపలాదారులంలా పని చేసి బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళీధర్ తెలిపారు. ఆదివారం స్థానిక సుభాష్ రోడ్లులో ఉన్న అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో 108వ మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా 2023-24కు సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ బ్యాంకులకు దీటుగా అర్బన్ బ్యాంక్ సేవలు అందిస్తోందన్నారు. ఇది సామాన్యుల బ్యాంకు అన్నారు. ఈ బ్యాంకులో పేద, మధ్య తరగతి కుటుంబాలకు అనేక వ్యాపార గృహ రుణాలు అందించామన్నారు. భవిష్యత్తులోనూ పేదవాడు సొంత ఇంటి నిర్మాణం కోసం తమ తోడ్పాటు ఉంటుదన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు బి.రమణయ్య, పి.కృష్ణకుమార్, జె.రామాంజనేయులు, ఎం.చంద్రశేఖర్, ఆర్.భాస్కర్, సుంకర రమేష్, చింతా భాస్కర్, మాజీ పాలకవర్గ సభ్యులు శ్రీరాములు, ఆసీఫ్, ఉద్దీన్, బ్యాంకు ఖాతాదారులు, డిపాజిట్‌దారులు పాల్గొన్నారు.

జిల్లా ప్రయివేటు పాఠశాలల సంఘం నూతన కమిటీ ఏర్పాటు

అతిథులను సన్మానిస్తున్న ప్రయివేటు ఆసుపత్రుల కమిటీ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సంగమేష్ నగర్‌లో ఉన్న రఘు సైనిక్ స్కూల్‌లో ఆదివారం జిల్లా ప్రయివేటు పాఠశాలల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా గంగాధర్‌యాదవ్, జిల్లా అధ్యక్షులుగా గోపాల్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమణారెడ్డి, జిల్లా కోశాధికారిగా రామచంద్ర, సిఆర్‌ఒగా రవిచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా, నగర గౌరవాధ్యక్షులుగా శ్రీవాత్సవ, నగర అధ్యక్షులుగా భాస్కర్‌రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, నగర కోశాధికారిగా జానకిరాములు, జిల్లా ఉపాధ్యక్షులుగా రాఘవేంద్ర, తాడిపత్రి బాబయ్య, కణేకల్ ప్రభంజన్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, కూడేరు శ్రీధర్, పామిడి రవి, సహాయ కార్యదర్శులుగా తాడిపత్రి చంద్రశేఖర్‌రెడ్డి, రాయదుర్గం మహమ్మద్ అమీన్, నార్పల సుధాకర్, అనంతపురం సోమశేఖర్, అనంతపురం వేణు, అనంతపురం రఫీ, ఇసి సభ్యులుగా అనంతపురం రాజా రమేష్, గౌరవ సలహాదారులుగా అనంతపురం రామాంజనేయులు, అనంతపురం ఎంసీ మద్దయ్యను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 300 మందికిపైగా కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

సుబ్బరాయుడుసాగర్‌తో పాటు చెరువులను నింపాలి

విలేకరులతో మాట్లాడుతున్న రైతుసంఘాల నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని సుబ్బరాయుడు సాగర్ డ్యామ్‌తోపాటు చెరువులకు నీరు నింపాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఎపి కౌలు రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం సమీపంలోని బ్రహ్మంగారి గుడి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రైతు సంఘం మండల కార్యదర్శి సత్తార్‌గోపాల్, రైతుసంఘం మండల గౌరవాధ్యక్షులు టి.బాలగుర్రయ్య మాట్లాడుతూ తుంగభద్ర జలాశయం పూర్తిస్థాయిలో నిండినా జిల్లా ప్రాజెక్టులు, చెరువులకు నీరు తీసుకురాలేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా మండలంలోని కడవకల్లు సంజీవపురం సమీపంలో ఉన్న సుబ్బరాయుడు సాగర్ డ్యామ్, పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి పక్కన ఉన్న బోప్పేపల్లి చెరువుకు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నీటి కేటాయింపుల్లో నిర్లక్ష్యం వహిస్తే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం ఉపాధ్యక్షుడు చిన్ని కృష్ణుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నకుళ్లాయప్ప, కౌలు రైతుసంఘం మండల కార్యదర్శి గోపాలకృష్ణ, రైతుసంఘం మండల సహాయ కార్యదర్శులు ఎ.నాగయ్య, టి.ఓబుళయ్య, రైతు సంఘం మండల కమిటీ నాయకులు ఓబుల్‌రెడ్డి, అంకిరెడ్డి, నాగమునేంద్ర, రైతులు ఆంజనేయులు, పెద్ద నరసింహుడు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం

ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

అనంతపురం : ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న ఉపాధ్యాయులను ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా పామిడి 5వ వార్డులోని జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు పండిట్ ప్రిస్కిల్లాను సత్కరించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ నాయకులు సుబ్బయ్య, మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు వృత్తి, పనితనం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందించడం ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చినట్టు అయిందన్నారు.

ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించాలి

బెల్ట్‌షాపులు ఏర్పాటు చేయొద్దు-ఐద్వా రాష్ట్ర కోశాధికారి ఇవి.సావిత్రి

విలేకరులతో మాట్లాడుతున్న ఇవి.సావిత్రి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి ఇవి.సావిత్రి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లోని ఐద్వా జిల్లా కార్యాలయంలో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మహిళా సమాఖ్య, ప్రగతిశీల మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మద్యపానం నిషేధించాలని మహిళా సంఘాలుగా దశాబ్దాలపాటు పోరాటం చేస్తున్న నేపథ్యంలో ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోగా విచ్చలవిడి మద్యపానం విక్రయాలకు తెరలేపడం దుర్మార్గమన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో బెల్ట్‌షాపులు రద్దు చేయాలని ఐద్వా పెద్దఎత్తున పోరాటం చేసిన సందర్భంగా అప్పట్లో బెల్టుషాపులు తొలగించారని గుర్తు చేశారు. ప్రజలకు మేలు చేస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాణ్యమైన తక్కువ ధరకే మద్యం సరఫరా చేస్తామంటూ మద్యం పాలసీ రూపొందించి ప్రయివేట్ టెండర్లు వేయడానికి శ్రీకారం చుట్టడం తిరిగి మందుబాబుల ఆగడాలతో మహిళలకు రక్షణ కోల్పోయే పరిస్థితి ఏర్పడనుందన్నారు. రాష్ట్రంలో 2000 షాపులు 4000గా పెంచడానికి ప్రయత్నం చేసి మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చి ప్రజల మానప్రాణాలు సమాజంలో పడి వేయడం సరికాదన్నారు. టెండర్ల ద్వారా కేవలం మద్యంషాపుల దరఖాస్తులకు రూ.3వేల కోట్లు లాభం వస్తుందని ప్రభుత్వం చూస్తోంది తప్ప.. తర్వాత జరిగే పర్యావసనాలు పట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే డ్రగ్స్, మద్యపానానికి బానిసలైన యువత, చిన్నపిల్లల సైతం విచక్షణ రహితంగా వ్యవహరిస్తున్నారన్నారు. మద్యం నిషేధించాలని పోరాడుతున్న క్రమంలో మద్యం నిషేధం చేయకపోయినా నియంత్రించాలని ప్రజల మానప్రాణాలు కాపాడబడతాయని, విచ్చలవిడి మద్యం అమ్మకాలు జరగకుండా ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహించాలని కోరారు. బడి, గుడి, ప్రజల ఆవాస కేంద్రాల్లో మద్యంషాపులు నిర్వహించరాదన్నారు. బెల్ట్‌షాపులను పూర్తిగా నిషేధించాలన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో డి అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మద్యపానం వల్ల ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీ అమలులో పునరాలోచించి మద్యపాన నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా సమాఖ్య జిల్లా పార్వతీ ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పుడున్న 2000 షాపుల్లోనే బడి గుడి సమీపంలో ఉన్నాయని వాటిని తొలగించాలని కోరారు. ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు జె సరస్వతి మాట్లాడుతూ అతి చిన్న వయసు పిల్లలు కూడా మద్యపానానికి బానిసలై తల్లిదండ్రులతో ఘర్షణ పడే పరిస్థితి నేడు ఏర్పడిందన్నారు. ప్రజలకు విద్యా వైద్యం జీవనం భారం అవుతున్న రోజుల్లో మద్యపానం మరింత దర్భర జీవితాలకు దారితీస్తాయని ప్రభుత్వాలు పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 5వ జిల్లా కోశాధికారి చంద్రిక, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు చంద్రకళ పాల్గొన్నారు.

కామ్రేడ్ 'ఏచూరి' జీవిత చరిత్రను తెలుసుకోవాలి

సిపిఎం నాయకులు

పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యార్థి దశలోనే వామపక్ష భావజాలానికి ఆకర్షితులై 1974లో విద్యార్థి ఉద్యమంలోకి అడుగుపెట్టిన నాటి నుంచి చివరి శ్వాస వరకూ పేదలు, కష్టజీవుల పక్షాన గలమెత్తిన విప్లవయోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి జీవిత చరిత్రను ప్రతి తెలుగు పౌరుడు తెలుసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి జీవిత చరిత్రపై 'లాల్ సలాం' పేరుతో ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆదివారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 'సీతారాం ఏచూరి మా తెలుగువాడు' అని చెప్పుకోవడం జాతికి గర్వకారణంగా ఉందన్నారు. సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీలేని యుద్ధం చేసిన పోరాటయోధుడు సీతారాం ఏచూరిని కొనియాడారు. ఇంతటి మహోన్నతమైన విప్లవ యోధుడి జీవిత గురించి తెలుగు పౌరులు తెలుసుకుని ఆయన ఆశయాల సాధన కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఉరవకొండ : కామ్రేడ్ సీతారాం ఏచూరి జీవితంపై ప్రజాశక్తి రూపొందించిన ప్రత్యేక సంచికను సిపిఎం నాయకులు ఆదివారం ఉరవకొండలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి జీవితం గురించి నేటి ప్రజానీకంతో పాటు యువతకు తెలియజేయాలని సదుద్దేశంతో ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ముద్రించడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉరవకొండ మండల కార్యదర్శి మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, నాయకులు సీనప్ప, వెంకటేశులు, టిడిపి నాయకులు తిప్పారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సోనియా సీన, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

కురుబల అభివృద్ధికి కట్టుబడిన ప్రభుత్వం

ఎంపి అంబికా, ఎమ్మెల్యే గుమ్మనూరు

ఎమ్మెల్యే, ఎంపీని సన్మానిస్తున్న కురుబ సంఘం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

కురుబల సమస్యల పరిష్కారంతోపాటు సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని గుంతకల్లప్ప కళ్యాణ మండపంలో కురువ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కురుబ సోమశేఖర్ (సోము) అధ్యక్షతన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎంపీలకు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి సిఎం చంద్రబాబు సుముఖత చూపడం హర్షించదగ్గ విషయమన్నారు. గత పాలకులు కురుబలను విస్మరించారన్నారు. అయితే ఎన్‌డిఎ ప్రభుత్వం కురుబలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గొర్రెలను సబ్సిడీతో ఇవ్వడానికి, ఉచిత ఇన్సూరెన్స్ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే కనకదాస కళ్యాణ మండపానికి ఎంపీ నిధుల కింద రూ.10 లక్షలు ఇస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. అలాగే విగ్రహ ప్రతిష్టకు కూడా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, కురుబ సంఘం సీనియర్ నాయకులు పూజారి బసప్ప, అనంతపురం పార్లమెంటు టిడిపి కురుబ సాధికారిక జిల్లా అధ్యక్షులు, కురుబ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కురుబ చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ శివప్ప, మాజీ జడ్పిటిసి పాల మల్లికార్జున, జడ్పిటిసి కదిరప్ప, టిడిపి పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, ముస్తూర్ తిమ్మప్ప, ముస్తూరు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

జీవో 85ను రద్దు చేయాలి

కొనసాగిన డాక్టర్ల నిరసన దీక్ష

సంఘీభావం తెలుపుతున్న అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ వైద్యులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 85ను వెంటనే రద్దు చేయాలని వైద్యులు డిమాండ్ చేశారు. 85కు వ్యతిరేకంగా జిల్లాలోని 55 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న ప్రభుత్వ వైద్యులు విధులు బహిష్కరించి చేపట్టిన నిరసన ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు వ్యతిరేకంగా ఉన్న జీవో 85ను రద్దు చేసేంత వరకూ ఆందోళనలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే టైం బాండ్ ట్రైబల్, ప్రమోషన్లు, ట్రైబల్, ఎఫ్‌డిపి అలవెన్స్ ఇవ్వాలని, 2020 బ్యాచ్ నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏకగ్రీవంగా జిల్లా కార్యవర్గ ఎన్నికలు

స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సమావేశ భవనంలో ఎపి హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా షఫీ, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీ, ఉపాధ్యక్షులుగా సుజాత, రవీంద్ర, నాగలక్ష్మి, దేవి, కె.అరుణకుమారి, ట్రెజరర్‌గా ఈశ్వరయ్య, జాయింట్ సెక్రటరీలుగా లత, రాఘవేంద్రరెడ్డి, వాణినాయుడు, నాగలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహేంద్రబాబు, మహిళా విభాగ సెక్రటరీగా పద్మజ, పబ్లిసిటీ సెక్రటరీగా పద్మావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తాలుకాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా నాయకులు కోకిల చాముండేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వానపత్రాన్ని చూపుతున్న మేయర్ వసీం

ఢిల్లీ సదస్సుకు 'అనంత' మేయర్‌కు ఆహ్వానం

అనంతపురం కార్పొరేషన్ : ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో నిర్వహించనున్న సదస్సుకు అనంతపురం మేయర్ మహమ్మద్ వసీంకు ఆహ్వానం అందింది. ఈ సదస్సులో నగరాల్లో ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధి.. రాబోవు రోజుల్లో చేపట్టబోయే ఆధునీకరణ అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు.

విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

రాప్తాడు : మండల కేంద్రంలోని ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహంలో ఆదివారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వార్డెన్ గోవిందరెడ్డి విద్యార్థుల క్రమశిక్షణ వివరాలను తల్లిదండ్రులకు వివరించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా విద్యార్థుల బాగోగులు చూసుకుంటున్నామని తెలిపారు. తర్వాత ట్యూషన్ ఉపాధ్యాయులు మురళీకృష్ణ, గంగన్న విద్యార్థులపై తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రమశిక్షణపై వివరించారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు వసతి గృహం బోధన ఉపాధ్యాయులు మురళీకృష్ణ, గంగన్న, అటెండర్ రామాంజనేయులు, పక్కీరప్ప, క్యాష్‌ఫోర్స్ నాగేష్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇకెవైసి చేయించుకోవాలి

యల్లనూరు : మండలవ్యాప్తంగా పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటలకు క్రాప్ బుకింగ్‌తోపాటు ఇకెవైసి చేయించుకుంటేనే ప్రభుత్వం రాయితీలకు అర్హులు అవుతారన్నారు.

వరద బాధితులకు విరాళం

బ్రహ్మసముద్రం : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారి స్ఫూర్తితో వరద బాధితుల కోసం సేకరించిన విరాళాన్ని సూగేపల్లి టిడిపి ఎస్సీ సెల్ నాయకుడు సురేంద్రం స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు అందజేశారు. విజయవాడ వరద బాధితుల కోసం ప్రజల నుంచి సేకరించిన రూ.10వేలను అందజేశారు.

బిసి బాలికల హాస్టల్ తనిఖీ

అనంతపురం : నగరంలోని బిసి బాలికల వసతి గృహాన్ని రాష్ట్ర బీసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వసతి గృహంలోని విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత హాస్టల్ పరిసరాలను పరిశీలించి నిర్వాహకులు, అధికారులకు సలహాలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని ఆదేశించారు.

నేడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

అనంతపురం కలెక్టరేట్ : గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం అనంతపురం రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఎం నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సర కాలంగా అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామ పొలం సర్వేనెంబర్ 194/8, రుద్రంపేట గ్రామ పొలం సర్వేనెంబర్ 225/2ఏలో దాదాపు 600 మంది పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారన్నారు. ఇక్కడ ఎలాంటి వసతులు లేకపోయినప్పటికీ దళితులు, మైనార్టీలు, వెనుకబడిన వర్గాలు అనేకమంది తలదాచుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఇప్పటికే ఆర్‌డిఒ, రూరల్ తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేశామన్నారు. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందనా లేదన్నారు. ఇప్పటికైనా పేదలకు పట్టాలివ్వాలని నేడు నిర్వహించనున్న ధర్నాకు పెద్దఎత్తున పేదలు హాజరైన విజయవంతం చేయాలని కోరారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

అనంతపురం : బుక్కరాయసముద్రం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పరామర్శించారు. మృతులంతా అనంతపురం నగరంలోని నారాయణపురం పంచాయతీకి చెందిన వారు కావడంతో ఎమ్మెల్యే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తర్వాత పోస్టుమార్టంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.త ర్వాత అంత్యక్రియల కోసం భాధిత కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందించారు.

ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలి

యల్లనూరు : తాడిపత్రి నుంచి యల్లనూరు మీదుగా సింహాద్రిపురం వరకూ సాయంత్రం 5 గంటల బస్సును పునరుద్ధరించడంతోపాటు సమయానికి అనుగుణంగా బస్సు సర్వీసులను నడపాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాజారామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో యల్లనూరు నుంచి తాడిపత్రికి వెళ్లాలంటే ప్రతి అరగంటకూ ఓ బస్సు ఉండేదన్నారు. అలాగే యల్లనూరుకు సమయానికి అనుగుణంగా బస్సు నడిపేవారన్నారు. దీంతో విద్యార్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదన్నారు. ప్రస్తుతం బస్సు సర్వీసులను తగ్గించడంతోపాటు కొన్నింటిని తొలగించడంతో ప్రయాణికులు, విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి 5గంటల బస్సుతో పాటు ఉదయం 7:15 గంటలకు తాడిపత్రి వయా యల్లనూరు, కృష్ణాపురం, వెన్నపూసపల్లి, సింహాద్రిపురం బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరారు.

పలువురు అధికారుల బదిలీ

శింగనమల : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు (రెగ్యులర్) అనంతపురం అర్బన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తాడిపత్రి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.ఆంజనేయప్రసాద్‌ను నియమించారు. అలాగే ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ బి.రామకృష్ణ జిల్లా సివిల్ సప్లయ్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాయదుర్గంలో విధులు నిర్వహిస్తున్న బి.హబీబా భానుబి వచ్చారు. అలాగే ఆర్‌ఐ హనుమాన్ ప్రసాద్ బెలుగుప్పకు బదిలీ అయ్యారు.

జనశక్తినగర్‌లో ముగురు తొలగింపు

అనంతపురం రూరల్ : నగరంలోని జనశక్తి నగర్‌లో పేరుకుపోయిన మురుగును అధికారులు తొలగించారు. మొన్న జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని జనశక్తి నగర్‌వాసులు విన్నవించిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ సిబ్బందితో మాట్లాడు డ్రెయినేజీ సమస్యను పరిష్కరించారు. ముఖ్యంగా రోడ్డుపై ఉన్న మురుగును తొలగించారు. దీంతో జనశక్తినగర్‌వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఆత్మకూరు ఎస్‌ఐగా లక్ష్మీనారాయణ

ఆత్మకూరు : మండల నూతన ఎస్‌ఐగా లక్ష్మీనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చున్నారు. ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను కాపాడుతామన్నారు. చట్ట విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించేవారి సమాచారం తనకు అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పోలీసుల తనిఖీలు

గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ జయానాయక్

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మెచ్చిరి గ్రామంలో అర్బన్ సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పాత కేసుల్లో ఉన్నవారు, అక్రమ మద్యం అమ్మిన వారు, అనుమానితులు ఇళ్లు, పరిసర ప్రాంతాలు, వాహనాలను తనిఖీ చేశారు. గ్రామంలో ఇటీవల జరిగిన హత్యతో రెండు వర్గాలుగా ప్రజలు విడిపోయి గొడవ పడి కొట్టుకోవడంతో జైలుకు వెళ్లారని,అలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా ఉండాలని సూచించారు. ప్రజలు శాంతియుతంగా జీవించాలని సూచించారు.

24 నుంచి 'పొలం పిలుస్తుంది'

బ్రహ్మసముద్రం : రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్న పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సరిత ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ అనుబంధ శాఖలు క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు పద్ధతులను వివరించనున్నట్లు తెలిపారు. 24న ఉదయం బైరసముద్రం, మధ్యాహ్నం బ్రహ్మసముద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

శ్రమదానంతో రోడ్డు వేసుకున్న గ్రామస్తులు

బొమ్మనహాల్ : మండలంలోని కొలగానహళ్లి గ్రామానికి చెందిన ప్రజలు స్వయంగా శ్రమదానం చేసుకుని రోడ్డు వేసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు బాగా దెబ్బతింది. దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గ్రామస్తులో నడుం బిగించారు. ఇందులో భాగంగా దాదాదాపు కిలోమీటర్ వరకూ ట్రాక్టర్ల సాయంతో మట్టి రోడ్డు వేసుకున్నట్లు గ్రామ పెద్ద అనంతరాజు తెలిపారు.

మట్టి రోడ్డు వేసుకుంటున్న కొలగానహళ్లి నాయకులు

'జగన్ నిర్వాకంతో తిరుమల లడ్డు కల్తీ'

గుత్తి : మాజీ సీఎం జగన్ నిర్వాహకం వల్లే తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందని మాజీ ఎమ్మెల్యే కె.మధుసూదనగుప్తా ఆరోపించారు. ఆదివారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్‌లో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గౌతమపురి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆరాధ్యంగా పూజించే తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో లడ్డు ప్రసాదం కల్తీ కావడం బాధాకరమన్నారు. కల్తీకి మాజీ సీఎం జగన్, వైసిపి నాయకులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త కొట్రికె శ్రీహరిగుప్తా, శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.వెంకటేశ్వర్లు రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాకం శ్రీకాంత్, కార్యదర్శి కె. కిషోర్, న్యాయవాది మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నీటి కోసం చిన్నారుల తిప్పలు

నార్పల ప్రాథమిక పాఠశాలలో నీటి సమస్య ఇళ్ల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి..

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో తాగడానికి కూడా నీరు లేక చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకుని తాగాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక తిన్న ప్లేట్లు కడుక్కోవాలంటే పరిస్థితి మరీ దారుణంగా ఉందని అంటున్నారు. ఇంటి వద్ద నుంచి బాటిళ్లలో తెచ్చుకుంటున్న నీరు సైతం సరిపోక అరకొరగా తాగుతూ దాహం తీర్చుకుంటున్నామన్నారు. ట్యాంకర్ల ద్వారా నీరు తోలుతున్నా అవి ఏమాత్రం సరిపోవడం లేదని వాపోతున్నారు. ఆఖరికి మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారు సైతం వంట చేయడానికి అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి. మరోవైపు ఉపాధ్యాయులు కూడా నీటి కోసం తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలలో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఇఒ నారపరెడ్డిని వివరణ కోరగా కొద్ది రోజుల నుంచి వారానికోసారి ఒక ట్యాంకర్ నీటిని పాఠశాలకు సరఫరా చేస్తున్నామన్నారు. అయినా పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను ఉన్నతాధికారులతోపాటు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో భవన కార్మికుడు మృతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం చౌలూరు గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో కర్నాటక రాష్ట్రం గౌరిబిదనూరు తాలూకా కుర్లపల్లికి చెందిన భవన కార్మికుడు వెంకటరాముడు (50) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అయితే కర్నాటక సరిహద్దులో అమ్ముతున్న కల్తీ కల్లు తాగి మృతి చెందినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలనుంది.

మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణిశ్రీ, దగ్గుపాటి ప్రసాద్

మంత్రి నిమ్మలకు జిల్లా నాయకుల వినతులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు సాగునీరు అందించే భైరవానితిప్ప ప్రాజెక్టుకు నీరు ఇచ్చేందుకు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని రాయదుర్గం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు కోరారు. ఈమేరకు ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసి కొంతమేరకు పనులు చేపట్టారని గుర్తు చేశారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చాక పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోగా ఎత్తిపోతల పథకాన్ని చేపడతామని హామీ ఇచ్చారన్నారు. కావున రెండు నియోజకవర్గాల ప్రజలు, రైతుల సంక్షేమం కోసం బిటిపి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని కోరారు.

శింగనమల : నియోజకవర్గంలోని తాగు, సాగునీటి సమస్యలపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అనంతపురంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి విన్నవించారు.

అనంతపురం కలెక్టరేట్ : నడిమివంక, మరువవంక పునర్ నిర్మాణానికి నిధులివ్వాలని అనంతపురం ఎమ్మెల్యే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో జలవనరుల శాఖ మంత్రి రామానాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

పుట్లూరు : జిల్లాకు వచ్చిన రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును టిడిపి నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా టిడిపి నేత కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి మంత్రితో మాట్లాడుతూ గండికోట నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు నీరిచ్చి శాశ్వత పరిష్కారం చూపి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే చాగల్లు రిజర్వాయర్ నుంచి నీటిని చెరువులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘనస్వాగతం

గుత్తి : జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకట శివుడు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం గుత్తిలో ఘన స్వాగతం పలికారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో మంత్రికి జి.వెంకటశివుడు యాదవ్ శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. టిడిపి నాయకులు మంత్రిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు నంద్యాల రంగారెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు ఎన్.సుధాకర్ నాయుడు, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పవన్ కుమార్, నాయకులు కదిరప్ప, ధర్మరాజు, ఆచారి, శేఖర్, బాల రమేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మల రామానాయుడుకు స్వాగతం పలుకుతున్న జిల్లా టిడిపి నాయకులు

కొనసాగిన 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని చామలూరు గ్రామంలో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ వంద రోజుల పరిపాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దాదావు

పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

రూ.4,500 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. అదే వైసిపి పాలనలో గ్రామీణ రహదారుల అధ్వాన్నంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అనంతరం సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కాగా త్వరలోనే నియోజకవర్గ యువత కోసం జాబ్‌మేళా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, మాజీ ఎంపిపి ఆకుల అరుణ, మండల ప్రత్యేకాధికారి రామసుబ్బారెడ్డి, తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ దివాకర్, సీఐ కౌలుట్లయ్య, టిడిపి నాయకులు వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ప్రతాప్‌చౌదరి, ఆకుల ప్రసాద్, ఆకుల విజయ్‌కుమార్ (బాబు), తెలుగు యువత నాయకుడు చంద్రబాబు, ఆకుల అనిల్, తేజ, పిట్టు రంగారెడ్డి, మాజీ వైస్‌ఎంపిపి తిప్పన్న, కేసేపల్లి మోహన్, గూగూడు ఓబిలేసు, రాధాకృష్ణ, నాగభూషణం, ఇస్మాయిల్, ప్రదీప్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని 13వ వార్డులో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, కార్యదర్శి ఇనాయత్‌బాషా, మాజీ వైస్‌చైర్మన్ మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

సగర సామాజిక వర్గాన్ని ఆదుకోవాలి

సమావేశంలో పాల్గొన్న సగర కులస్తులు

ప్రజాశక్తి-పామిడి

విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో వెనకబడిన సగర సామాజిక వర్గాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వాలు చొరవ చూపాలని మండల సగర కులస్తులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనంలో సగర కులస్తులు సమావేశం నిర్వహించారు. ముందుగా సగర సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాజగోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్ర, ఉపాధ్యక్షులుగా లీలా మనోహర్, గౌరవాధ్యక్షులుగా వెంకటనారాయణ, ట్రెజరర్‌గా విశ్వనాథ్, కార్యదర్శిగా వెంకటరాముడుతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సగర సంఘం నూతన అధ్యక్షుడు రాజగోపాల్ మాట్లాడుతూ సగర కులంలో ఉన్న పేదల అభివృద్ధికి మనమందరం కలిసికట్టుగా పని చేద్దామన్నారు. సగర బీసి కార్పొరేషన్ ద్వారా పూర్తి సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని కోరారు. మనమందరం కలిసికట్టుగా మండల కేంద్రంలో రాజర్షి భగీరథ మహర్షి విగ్రహ ప్రతిష్ఠ చేసుకోవాలన్నారు. అలాగే నామినేటెడ్ పోస్టులు దక్కించుకునేందుకు ప్రయత్నం చేయాలన్నారు. సగర కుల సామాజిక భవనానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి సూరి, మస్తానయ్య, ఓబుళపతి, దేవరపల్లి రామకృష్ణ, దేవరపల్లి దేవరాజు, సగర ప్రజలు పాల్గొన్నారు.